చదరంగము

[కథానిక]

◉

శ్రీ వేలూరి శివరామశాస్త్రి

మూఁడు ముళ్లు పడువరకును ఈపెండ్లి యగునను నమ్మకము మగపెండ్లివారికిగాని, ఆడుపెండ్లివారికిగాని లేదు. పెండ్లికొడుకు బృహస్పతి!

వేయిమొగములతో వెలికుబుకు తన కొడుకు తెలివితేటలకు వియ్యంకుడు వెనుకకు పీకునేమో యని వెనుకయ్య భీతి. కట్నముగాని కానుకగాని పెట్టికాబోవు తన యల్లుగుఱ్ఱను నడుమ నెవరు తెరవాటు గొట్టుదురో యని పెండ్లికూతురుతండ్రి పాపయ్యభీతి.

వియ్యంకు లిరువురకును ఇట్టి భీతితో పని లేదు. ఏలనగా ఈ పాపయ్యకు ఆస్తిపై ఆస్థ. వెనుకయ్యకు కొనితెచ్చుకొన నక్కరలేని కోడలిపై ఆస్థ.

చీరెలమీదను, సారెలమీదను వాంఛయేకాని వధువుకు వరునిమాటయే లేదు. వాఁడొక కొండముచ్చు కాకుండిన చాలు. ఈ వరుఁడో చూపుల గుఱ్ఱము. ఇక నెందులకు భీతి? ఇసుకతక్కెడ పేడతక్కెడ.

లగ్నము నిశ్చయము కాగనే పాపయ్య మేనల్లుని కడకు వెళ్ళెను. ఈ పెండ్లి కగు వ్యయములో సగమేని మేనల్లునికడ పుచ్చుకొనవలయు నని పాపయ్య ఆశ.

'నాయనా, మన సుందమ్మను ఉండవల్లి వెనకయ్యగారి కొడుకు శంకరయ్యకు ఇచ్చి పెండ్లి చేయ పెద్దలు నిశ్చయించిరి.' అని పాపయ్య నీళ్లు నములెను.

'ఏమేమీ, సుందిమెడ కుందిలో పెట్టితివా?' అని ఆ మేనల్లు డనుచుండగా దారి మారెనని పాపయ్య తెలిసికొని 'ఓయీ, నే నిచటికి నీసలహా తీసికొనుటకు రాలేదు. లగ్నము నిశ్చితమయిన దనిమాత్రము చెప్పుటకు వచ్చితిని' అనెను.

'గొప్పపని చేయవచ్చితివి. చెప్పుటకు నీకు సిగ్గయినను లేదే? చెప్పితివి: కడుపు నింపితివి. చాలు నిక బొమ్మ' అని ఆ మేనల్లు డనెను.

పాపయ్య మేనల్లునికడ అన్నమునకు బదులు సున్నము తిని అచటినుండి లేచెను. పొరుగూరు దాపుననే కలదు. అచట తన కొక మిత్రుడు కలడు. అకాలమున పాపయ్య అచటికి జేరెను. మిత్రు డాతిథ్య మిచ్చెను.

భోజనసమయమున పాపయ్య—'మన అమ్మాయి సుందమ్మకు లగ్నము నిశ్చయించుకొని వచ్చితిని' అని చెప్పెను.

'అదృష్టవంతుడవు. తిరిగితిరిగి నా కాళ్లు బలపాలు కట్టినవి. మా అమ్మాయికి ఎచటను సంబంధము కుదురలేదు. కుదిరిన సంబంధము మా అమ్మాయి ఒప్పదు.' అని మిత్రు డనెను. కన్నవానికి కష్టము తెలియవలయునుగాని పసికూనలకును గొడ్డుమోతులకును ఏమి తెలియును? ఈ సంబంధముగురించి మా మేనల్లునితో చెప్పబోవగా తన్నక విడిచిపెట్టెను. అటనుండి యిట కొక పేపరుగు తీసితిని'. అని పాపయ్య అనెను.

'పాపము. సంబంధ మెచట?'

'సంబంధమున కేమోయీ బంగారమువంటి సంబంధము. వారికి పదిఎకరాల చెరకుతోట. మూడుకుంటల పసపుతోట. మూడున్నర ఎకరాల సపోటాతోట. ఉండవల్లివారి నెరుగవూ?' అని పాపయ్య నోరుకరచుకొనెను.

'సంకోచించుచున్నటు లున్నావు?'

తన సంకోచమునకు పాపయ్య వగచి—'ఎబ్బె. వెనుకయ్యగారి నెరుగవు కాబోలు.'

'ఎరుగకేమి?'

'ఇక నేమి? ఆయనకొడుకే. పేరు శంకరం.'

'ఆహా. అలాగా? మంచిది.' అని ఆ మిత్రుడు నసికెను.

దాపుననే వారి సంభాషణ నాలకించుచున్న లక్ష్మి 'వాడి కిచ్చేబదులు వాకట్లో దున్నపోతు కివ్వండి'అని అనెను.

'చిన్న నోటికి పెద్దరుపులు' అని ఆ మిత్రుడు తన కూతును వ్రేలజూపుచు-'దీనిని వారు చేసికొన నంగీకరింపలేదు. అందులకని యిది అటు లనుచున్నది' అని చెప్పెను.

పాపయ్య నవ్వి—'ఈ కాలపు పిల్లలందరు నింతే. ఇటులగుచో మనబోటి బీదవారి గతి యేమగును? మా మేనల్లుడుగూడ నిటులే యనెను. లోకులు కాకులు.' అని పాపయ్య చేయికడుగుకొని మరి ఆ ప్రస్తావన చేయక వెళ్లిపోయెను.

లగ్నమునకు మగపెండ్లివారు తరలివచ్చిరి. వచ్చుచునే నలుబది కాసుల గొలుసొకటి పంపిరి. ఆడు పెండ్లివా రాదరణరసము లెస్సగ చూపిరి. మూడు ముళ్లును పడెను. 'ఇల్లేడ్చు అమావాస్యయు ఇరుగు పొరుగేడ్చు తద్దినమును ఊరేడ్చు పెండ్లియు లే'దను సామెతను వితచేయుచు పాపయ్య తన లేబరమును వియ్యంకునకు విన్నవించుకొనెను. 'జేనె డెగిరి మూరెడు కుంగుట ఎందుల'కని వియ్యంకు డోదార్చెను. వియ్యంకు లిరువురకును నాటితో బెంగ వదలిపోయెను.

'పెండ్లికొడుకుకు ముప్పదేండ్లన్నా రేమిటి? కూకటులు కొలిచిచేసిన పెళ్లిలా వుంటే? కొండము చ్చున్నారు కుమారస్వామి లా వుంటే? ఇంతకూ సుందమ్మ అదృష్టం' అని ఊరివా రనుకొనిరి. ఈ యభిప్రాయము మార్చుకొనుట కా యూరివారి కెంతో కాలము పట్టలేదు.

౨

పెండ్లి అయినపిదప నాలుగేండ్లలో నాలుగు వందలసారులు శంకరయ్య అత్తింటికి వెళ్లెను. తండ్రి వాని నిసుమంతయు ఆపజాలక ముడియెద్దువలె విడిచి పెట్టి యూరకుండెను.

అల్లునిజెప్ప అక్రీతదాసుడు అను పదము జీత నాతములు లేని నౌకరు అను యోగార్థముతో పాపయ్య అల్లుడగు శంకరయ్యయెడల అన్వర్థమాయెను.

అత్తింటికడ మూన్నాళ్లు కాపురముచేసి సుందమ్మ పుట్టింటికి వచ్చెను. మరి మూన్నాళ్లకు శంకరయ్య తలిదండ్రులకు జెప్పక అత్తింటికి వచ్చెను.

అల్లుని జూచుచునే పాపయ్య పండ్లు పటపట కొరికి—'ఏలుకొనలేని ఓబయ్యకు పెండ్లి ఎందుకు?' అని పెరటిలోనికి జని అల్లునికి జరిపింపవలసిన మరియాదల నన్నిటిని తన సంతానమునకు విపులముగా బోధించెను.

శంకరయ్య మాటాడక అరుగుమీద కూరుచుండెను. తా ననుకొన్న చందముగా సుందమ్మ తలుపు చాటున నుండి తన్నోరచూపుల నభిషేకింపలేదు. కాళ్లు కడుగుకొనుటకు నీటిచెంబు తెచ్చి స్తంభముచాటున నుండి తనమీద నీరు చిలుకరించలేదు. కాగా అతడు కౌతుక మాపుకొనలేక పెరటిలోనికి చూచెను. ఏమియు ఎరుగనటులు సుందమ్మ గదిలోనుండి పెరటిలోనికి బోయి నూతిలో నీడ చూచుకొనుచు గూరుచుండెను. ఇది యేమి వాలకము? ఇది యేమి పతిభక్తి? ఏ యాడుది యేని యిటులు చేయగలదా?

పెద్ద మరదలు వచ్చి—'బావా, కాళ్లు కడుగు కొమ్మ'అని బట్టమీద నీళ్లు పోసెను. శంకరయ్య ఎలుగు వలె మరదలిని పట్టుకొనబోయెను. మరదలు గొల్లభామ వలె లోపల వాలెను. శంకరయ్య బట్ట పిడుచుకొని గృహగర్భములోనికి తొంగి చూచుచు మరల అరుగు మీద గూరుచుండెను.

రెండవ మరదలు వచ్చెను. శంకరయ్య—'మీ అక్కకు జబ్బుగా నున్నదా?' అని అడిగెను. 'నీకు జబ్బ నీయబ్బకు జబ్బు. అలసివచ్చితివి. ఈ కజ్జకాయ తిను'మని ఒక మొట్టికాయ మొట్టెను. శంకరయ్య దానిని పట్ట పరువెత్తబోవగా మూడవ మరదలు కాలడ్డము పెట్టెను. బావమరది గబగబ వచ్చి—'గుల్లం గుల్లం' అని పడిన శంకరయ్యను తగు రీతిగా ఉపయోగించుకొనెను. వీ రిటులు తన్ను హింసించుచుండగా గ్రుడ్లుపెట్టుకొనిచూచుచు గూరుచుండెనే యని సుందమ్మమీద శంకరయ్యకు పట్టరాని కోపము వచ్చెను. అతడా కోపము నపుడు జేబులో వేసికొని నడిరేయి బయటికిదీయ నిశ్చయించుకొనెను.

‘వంట జాగు లేదు. బావకు నీళ్లు తోడు’ అని సూరమ్మ కేకపెట్టెను. కొద్దిసేపటిలోనే పెద్దమరదలు వాకిటికి వచ్చి—‘బావా, ఉతకలాడు’ అని గదిలో నక్కెను. శంకరయ్య యిల్లంతయు శోధించుచు కొండంతాశతో పెరటిలోనికి బోయి చీకటిలో తడిమి తెల్లబోయి పరాకు చిత్తగించి చెంబెడునీరు మీద బోసికొనెను. ఆ నీరతనిచే గంతులు వేయించెను. గెంతుటకు కుడికాలెత్తగనే పీట ఒకవైపున పామువలె లేచెను. ఎడమకాలు జారి మడతపడి శంకరయ్య బిల్లపెట్టుగా ధమ్మని నేల గూలెను. ఒడలెల్ల బురద కొట్టుకొనెను. అటు ఇటు చూచి ఎవరును జూడకుండుట తన భాగ్యమనుకొని— ‘చలినీళ్లు చలినీళ్లు’ అని అరచెను.

మరదలు కిటికీలోనుండి తొంగిచూచి—‘కొంచెము సేపటివరకును తలుపుతీయ వీలులేదు. బావా, బావా, యింటిముందు బురదగుంటలో దున్నపోతు పడి గిలగిల కొట్టుకొనుచున్నది. అటు వచ్చి దానిని కొంచెము కట్టిపోవూ?’ అని అనెను.

మరదలికోరిక తీర్చుటకు శంకరయ్య గబగబ గృహప్రదక్షిణము చేసి వాకిటిలోనికి వెళ్లెను. అటనున్న ఊరివారందరును గుంటలోనుండి లేచినటులున్న శంకరయ్యను జూచి పకలబడిరి. శంకరయ్య వారి నవ్వుల కతీతుడై ఆ గుంపులో సుందమ్మ ఉన్నదేమో యని కనులతో వెదకుకొనెనుగాని వృథా.

అత డెటులో స్నానభోజనములు ముగించి పంచకు చేరెను. పాపయ్య ఒకరొకరికే చాపలును, మంచములును పరచెను. పిల్లలందరెచటివారచట శయనించిరి. పాపయ్యయు వాకిటితలుపు లోరగా మూసి మంచముమీద బరుండి గుఱ్ఱుకొట్ట మొదలిడెను. సూరమ్మయు వంటయింటి దీపము మలిపివేసెను.

లోలోపలినుండి పిలుపు వచ్చునని ఆసించుచున్న శంకరయ్య విసికి విసికి ఆవులించెను. చెవులు దోరబెట్టుకొని వినెను. కనులు పొడుచుకొని చూచెను. లేచి కూరుచుండెను. తలుపుసందునుండి దివ్వెవెలుగు వలరేని చెరువుఅలుగువలె వాకిటిలోనికి ప్రసరించుచుండెను. అతడు చేపవలె ఆ అలుగున కెదురెక్కి గదిముంగలి కేగెను. తలుపోరగా వేసియుండెను. సంతసించుచు శంకరయ్య దొంగవలె లోనికి దూరెను. ఎట్టెదుట మంచముమీద ముసుగుపెట్టుకొని పడుకొనియున్న సుందమ్మ!

శంకరయ్య నిట్టూర్చెను. జవాబు లేదు. మంచముచుట్టు ప్రదక్షిణించెను. మారు కదలిక లేదు. సముద్రమంత ధైర్యము తెచ్చికొని సుందమ్మమీద తమలపాకువలె చేయి ఆన్చెను. ప్రతిక్రియ లేదు. అతని చేయి కొంచెము సంచారము మొదలిడెను. సుందమ్మ అసింట జరగెను. శంకరయ్య కుత్సాహ మాగలేదు. గబుక్కున మంచముమీద నిండుబరువుతో కూలి పడుకొనెను.

‘నే నెవరని అనుకొంటివో? నేను నీ యక్కను. నేను నూతబడి చచ్చి వచ్చితిని. రావిచెట్టుమీది శని రావిచెట్టుకింది విఘ్నేశ్వరుని పట్టినటులు నిన్నుగూడ బట్టెదను. నిన్నుగూడ నూత గూల్తు చూడు’ అని సుందమ్మ పంగళించి ఒక్కతన్ను తన్నెను. శంకరయ్య మంచముమీదినుండి గోడిబిళ్లవలె ఎగిరి కిందబడి విలవిలలాడెను.

ఊరెల్ల ఎగిరిపోవునటులు మరల మరల నామాటలే ఆవర్తించుచు సుందమ్మ గ్రుడ్లెఱ్ఱజేసి చూచుచుండెను. శంకరయ్య లేచి బట్టలు దులుపుకొని సోకాలు పెట్టనొడగెను. పిల్లలందరును లేచి ఎవరో చచ్చిపోయినటు లేడ్వదొడగిరి. అత్తమామలు గబగబ గదిలోనికి పరువెత్తి శంకరయ్యను బయటికి లాగుకొని వచ్చిరి. ఉప్పన వచ్చినటులు ఊరంతయు మూగెను.

చెంగయ్యపంతులు లోని కేగి మరలివచ్చి సుందమ్మకు దయ్యముపట్టె నని చెప్పగా ఎక్కడివారక్కడ మాయమయిపోయిరి.

3

సూర్యుడు దోరపండువలె తూరుపున కనబడెను. పాపయ్య అల్లుని కూతును స్నానము చేయించి తడిబట్టలతో ఆంజనేయస్వామి కోవెలకు దీసికొనిపోయెను. అర్చకుడు పూజ చేయుచుండెను.

అపుడు పాపయ్య లేచి ఆంజనేయస్వామి యెదుట నిలువబడి చేతులు దోయిలించి—‘స్వామీ,

రెండునూరు లీయనిదే మంత్రాల మల్లావధానులు రాడు. నూ రీయనిదే జపాల జాలయ్య రాడు. మరి రెండు నూరులు లేనిదే పూజాపురస్కారములకును సంతర్పణ మునకును చాలదు. నేనా, గర్భదరిద్రుడను. మా వియ్యం కుడా, ఈగ కిలి పాముకు బలి పెట్టడు. ఏమి గతి?' అని విన్నవించుకొనెను.

శంకరయ్య త్రాచువలె లేచి—'ఆయనే యివ్వాలంటే ఈ దయ్యం వదలినట్లే. అదో దయ్యం, ఇదో దయ్యం. దయ్యాన్ని కన్నవాడు దయ్యం కాక ఏ మౌతాడు? మేం పెట్టిన గొలుసు తాకట్టు పెట్టి ఐ దొందలు తెండి' అని అనెను.

పాపయ్య ఆ మాటలకు మొగము వంకరగా పెట్టి—'మేము పెట్టితి మట పెట్టు. మీ నాయన ఏమి పెట్టెను? గిలుటు గొలుసు! అదియైనను తీసి సుందిమెడ బోసి చేయరాదు. సుబ్బిసెట్టికి నీ వయిదు వందల కొకనోటు వ్రాయుము' అనెను.

శంకరయ్య సుందమ్మమెడలోని గొలుసు పరీక్ష చేయుటకు మీద చేయివైచెను. సుందమ్మ మగని చెంప ఛెడేలు మనిపించి గొలుసుతీసి కింద బారవయిచెను. అది కంయిమని మోగెను.

'వింటివా దాని మోత? బంగార మగుచో నిటులు కంచువలె మోగునా?' అని పాపయ్య అనెను.

శంకరయ్య తెల్లబోయి 'నోటు రాయించండి రాసిపారేస్తా' అని అనెను.

అర్చకుడు కలము కాకితము సిరాబుడ్డిని సమకూర్చెను. మామ మతలబు చెప్పగా అల్లుడు వ్రాయగా పది కాకితములు పాడాయెను. పిమ్మట అర్చకుడు వ్రాయగా శంకరయ్య సంతకము చేయగా ఆనోటు సిద్ధమాయెను. అంతట పాపయ్య పూజ ముగించి అల్లుగూతుల వెంట నిడుకొని యిల్లు చేరెను.

నాలు గయిదు నాళ్ళలో మంత్రాల మల్లావధానులు జపితలతో దిగి జపము లారంభించెను. పది దినములపాటు జపములు సాగినపిదప నత డొకనాడు జపములో గూరుచుండి—'అదిగో ఆ దయ్యము ఆలుమగల యిరువురమీదను గూరుచున్నది' అని కంటికి కనబడినటులు చెప్పెను. సుందమ్మ విరుచుకొని పడిపోయెను. అది చూచి శంకరయ్య యిల్లు వెడలి పరుగిడ దొడగెను. అందరును అతనివెంట నురికి పట్టుకొని వెనుకకు తీసికొనివచ్చి మరల మాంత్రికునిముంగల కూరుచుండబెట్టిరి.

'ఆః. తిన్నగా అటులు దారికి రా. మగ రాకాసులే నాకు శరణు సొత్తురు. ఆడుదానవు నీ వొక లెక్కా?' అని ఆ మాంత్రికుడు హుంకరించి శంకరయ్యకు మంత్రజల మిచ్చెను. ఆ జలము త్రావిన కొలది కాలములో తల తిరిగి ఆతడు—'లా వొక్కింతయు లేదు' అను పద్యమును ఆవృత్తిచేయ మొదలిడెను. శంకరయ్యకు వచ్చిన దదియొకటే.

లోపలలోపలనే కాయు జ్వరమువలె లోలోపలనే పట్టి పాలార్చుచున్న దయ్యము నిటులు పైకుబికించిన మాంత్రికుని శక్తి కందరును సంతసించిరి. కాని శంకరయ్యతిమ్మిరి ఆ సంతసించినవారి కెవరికిని ఉరట కలిగింపలేదు. అతడు వారి యిండ్లన్నియు చెడదిరిగి—'మాయయ్య ,మన్నయినా నలిపి చేతిలో పెట్టడు. నన్ను చూడటానికి సుందికి కళ్లు లేవు' అని యేడ్చుచు వాగును. అత డిటు లేడ్వగా సుందమ్మ— 'నాకు చీర పెట్టు. పసపుపెట్టు. కుంకుమ పెట్టు.' అని గ్రుడ్లు ప్రత్తికాయలంత చేసి శంకరయ్యమీది కెగబడెను. శంకరయ్య భయపడి పారిపోవదొడగెను. పాపయ్య వెంటపడి లేడివలె పరుగెత్తి అల్లుని పట్టుకొని యింటికి నెట్టుకొని వచ్చి కట్టి పడవయిచెను.

'వద్దురా బాబో యీ పెండ్లాం' అని శంకరయ్య మొత్తుకొనెను.

'ఏమంటివి? వద్దురా బాబో యీ పెండ్లాం అనియా? నా కెందు కే మగడు నా కెందుకే?' అని పాడి 'పో లేచిపో' అని సుందమ్మ కట్లు విప్పి శంకరయ్యను ముందుల కొక తోపు తోసెను.

'ఎబ్బెబ్బె! ఏమీ లేదు. కట్టు నీచేతిమీదుగా కట్టు' అని శంకరయ్య సుందమ్మమీద చేయివైచెను.

'నాన్నా! ఇతడు నామీద చేయి వేయుచున్నాడు. కట్టు విప్పుకొన్నాడు. మీదిమీదికి వచ్చుచున్నాడు' అని సుందమ్మ తండ్రిని పిలిచెను.

పాపయ్య వడివడిగా వచ్చి శంకరయ్యాఒడలు నలుగగొట్టి ఎక్కడినుండియో ఒక తుక్కుగొలుసు తెచ్చి చేతులకును కాళ్లకును తగిలించి తాళము పెట్టి చీకటిగదిలో విడియించెను.

'అయ్య బాబో! ఐ దొండలకు నోటూ రాపిచ్చి, చేతులకూ కాళ్లకూ మురుగులూ కడియాలూ తగిలించి వద్దురా బాబో యీ పెండ్లాం'అని శంకరయ్య ఊరెగిరిపోవునటు లేడ్వనొడగెను. ఊరిపిల్లలు ఈ రెండు పాటలను అందుకొని ఒకడు— 'వద్దురా బాబో యీ పెండ్లాం' అని అనగా మరియొకడు— 'నాకెందుకే యీ మగడు' అని వంతపాట మొదలిడిరి

సుందమ్మ చాటుగా చీకటిగదిలోని కేగి 'నీవు వాగుచు కూరుచుండుము. కానిదే మీనాయన కానియు నీయడు' అని ఉపదేశించెను. 'ఓ భేషూ' అని శంకరయ్య 'లావొక్కింతయు లేదు' అని వాగదొడగెను.

శంకరయ్యను పట్టి తీసికొనివెళ్లుటకు వచ్చిన వెనుకయ్యరైతు ఇచటిసంగతు లన్నియు తెలిసికొనెను. అత డెటులో వీలుచేసికొని చీకటిగదిలో నున్న శంకరయ్యను చూచి వగచి—'పాపయ్య చెప్పినటులు పత్రములు వ్రాసితివా తిండికి లేకుండ చత్తువు' అని చెప్పెను. శంకరయ్యమనసు చెదరెను.

'దయ్యమును బాగుచేసినతరువాత కొడుకును కోడలిని తీసికొనిపోవచ్చును. ఐదువందలు వ్యయమయినది. వెంటనే పైకము తీసికొనిరమ్మని మీదొరకు చెప్పుము'అని పాపయ్య ఆ రైతును సాగనంపెను.

౪

వ్యవహారము ముదిరెనని వెనుకయ్య గ్రహించెను.—'నా కొడుకు శంకరయ్యచే వారును వీరును పత్రములు వ్రాయించుకొనుచున్నటులు తెలిసెను. వానికి కాకితము నలుపుచేయవలసిన పని లేదు. కాబట్టి వాడు వ్రాసిన నోట్లు వగైరా చెల్లవు'అని పత్రికలో ఒక ప్రకటన చేసెను.

పాపయ్య దానిని అల్లునకు జూపెను. శంకరయ్య బావురుమని ఏడ్చి—'ఒసే సుందీ, నన్ను కొట్లో పెటతారు కాబోసు. నానోటు! నానోటు' అని అరచెను.

'ఓరి పిచ్చివాడా! నే జెప్పినటు లొక కాకితము వ్రాయుము. వీరభద్రపల్లెమునకు హనుమత్పల్లెము' అని పాపయ్య అనెను.

'ఏమని?'

'నేను నోటు రాసినమాట నిక్కమే. అమ్మ పెట్టనూపెట్టదు, అడుక్కోతిననూ తిననివ్వదాయె. నే నేం చెయ్యాలి?'అని.

'అలా రాయచ్చూ?'

'కూడనిచో మానాయన మన్నయినా నలిచి పెట్టడని నీ వేల అనుచుంటివి?'

'అనొచ్చుగాని అచ్చు గుద్దచ్చూ?'

'ఓ. థంకామీద దెబ్బ కొట్టె.'

'అలాగయితే మా రయితును పిలిపించండి.'

'నీకే బెనురు పెట్టిపోయిన వెధవ వాడెందుకూ?'

శంకరయ్య మాటాడుటకు సంశయించెను.

ఇది జరగిన మరునాడే—

'నాచేత వారూ వీరూ నోట్లు రాయించుకోవడంలేదు. నేనే వ్రాయించేస్తున్నాను. నీ వివ్వవాయె. నే నేం చేయాలి? —శంకరయ్య.'

అని ఒక ప్రకటన పత్రికలలో వెనుకయ్యకు కనిపించెను.

వెనుకయ్యకు వెఱ్ఱులు పిచ్చులు ఎత్తుకొనివచ్చెను. అత డా ప్రకటన పట్టుకొని ఊరంతయు తిరిగెను. బంధుగుల కందరకును వినిపించెను.

ఉత్తరకుమారప్రజ్ఞ లని కొడుకుమీద కొరములు మిరయములు నూరెను. భస్మాసురు డని వియ్యంకునకు పేరు పెట్టెను. ఆస్తి చీల్చెను. రిజిస్టరు చేసెను. అరుగుమీద కూర్చుండి—'ఇక మామతో ఊరేగు' అని హుంకరించెను.

వెనుకయ్య యిటులు వీరావేశములో నుండగా గొల్ల డొక చీటి తెచ్చెను. వెనుకయ్య దాని నందుకొని,

జపములు నలుబదినాళ్లతో పూర్తియినవి. 'మాంత్రికునకు రెండు నూటపదారులును, జపితలకు నూటపదారులును పైకర్చు మున్నూరును వెరసి ఐదువందల పైచిలుకుతో రేపే దయచేసి మీకొడుకును కోడలిని తీసికొని పోవచ్చును. నా యింట భూదేవి తప్ప ఆమెసవతి లేదని తమకు విశదము.' అని చదివి—'ఓయీ మీ భస్మాసురుడు డబ్బుమాటేకాని జబ్బుమాట వ్రాయ డేమి?' అని ప్రశ్నించెను.

'ఇప్పుడు జబ్బేడ నుండదీ? మరిగత్తే ఆ మంతర గాణ్ణి చూసి చుట్టుపక్కల వూళ్లల్లో దెయ్యాలుగూడా లగత్తినయ్. ఊళ్లో దెయ్యాలన్నీ లెగిసినయ్యంటే. దెయ్యాలు లెగడ వేంటి యెంకమ్మగోరికి యేవిళ్లేంటి? ఒక్క యెంకమ్మగోరేంటి చుక్కమ్మగోరు నూరమ్మగోరు సుందమ్మగోరు ఎల్లమ్మగోరు పుల్లమ్మగోరు యెక్కడ నూసినా యేవిళ్లే, యిగ మూట మాపు నేసుకుని లెగండి.'

'సరిలే. నా కెక్కడ తీరిక? మా బావగారిని బతిమాలుకొందును.' అని వెనుకయ్య విసవిస విస్సయ్యగారి యింటికి వెళ్లెను.

అత డటు వెళ్లగనే గొల్లడిటు వెళ్లి వెనుకయ్య వ్రాసిన దస్తావేజు సంగతి యంతయు తెలిసికొనెను.

ఆ మరునాడు గొల్లడు విస్సయ్యతో పాపయ్య కడకు వచ్చెను. వచ్చుచునే వాడు తాను తెలిసికొనిన రహస్యమును పాపయ్యకు రహస్యముగనే చెవిని వేసెను.

పాపయ్య విస్సయ్యను చూచుచునే 'నీ వెందుకు వచ్చితివయ్యా హంసపాదవు' అని విస్సయ్య చేతులు పొడిచెను. గదిలో నున్న శంకరయ్య—'నే నిక్కడ ఛస్తావుంటే మానాన్న మంచాలు నేస్తున్నాడా? పోనీ డబ్బేనుయినా పంపాడా?' అని అరచెను.

'నాకు తీరిక లేదు- నీవు పోయి, మాంత్రికుని సత్కరించి కొడుకుగోడండ్రను తీసికొనిరమ్మని బావగారు నన్ను బతిమాలిరి.'

'అరుగో లోపల. జపముమీద. పోయి చూడుడు'

విస్సయ్య భక్తితో మాంత్రికునకు మొక్కి వారిపాదములముందు నూటపదారు రూపాయ లుంచెను. లక్ష్మిమోత విని కనులు తెరచి మాంత్రికుడు—'వెనుకయ్యగారి యిల్లు దయ్యాలకు పుట్టిల్లు. దానిని బాగు చేయనిదే యీ భూతగ్రస్తులటకు పోరాదు' అనెను.

'చిత్తము. వెనుకయ్య కిది చెప్పుదును' అని విస్సయ్య యనెను.

పిదప నామాంత్రికుడు ౧౧౬ మాత్రమే చూచి చప్పరించెను. పాపయ్య ఆ పైకము తీసి—'వారి కొప్పుకొన్నది ౨౩౨. పైవారికి ౧౧౬. పైకర్చులు ౩౪౦. మింజుమలె నూరా? ఇది బిచ్చమా?' అని విస్సయ్యమీద విసరికొట్టెను.

'అయ్యా, వారు నాకు చెప్పిన దింత. ఇచ్చిన దింత. ఈ చదరంగములో మీ రొండొరులే ఎత్తుపైయెత్తులు వేసికొనవచ్చును. నడుమ నేనువచ్చుట తప్పు. ఇక రాను' అని విస్సన్న అనెను.

పాపయ్య మరల ఆపైకము పోగుచేసికొని 'మీరు పోయి దయ్యముల కిల్లిద్దికిచ్చిన ఆ భూతభర్తనిటకు వెంటనే పంపు'డని అనెను. 'మంచిది' అని విస్సయ్య శంకరయ్యను చూచుటకు గదిముంగలికేగెను. పాపయ్య 'మీరు చూచుటకు వీలు లేదు' అని అడ్డువచ్చెను. విస్సయ్య మరి నీరేని పుచ్చుకొనక వెళ్లిపోయెను. శంకరయ్య ఏడ్వదొడగెను.

౫

పాపయ్య నాడే దస్తావేజుకు నకలు తెచ్చెను. చెట్టుకింది ప్లీడరు చెంగయ్యపంతులును పిలిపించి దస్తావేజును శంకరయ్యకు తెలుపుమని కోరెను.

'దీని భాగ్యమునకు నేను రావలెనా? మీ అమ్మాయి చెప్పలేదా? మీ భార్య చెప్పలేదా? అంత రకును అప్పీలు మీరు చెప్పలేరా?'

'మీ రుండగా మేమా మాబొంద'

అంత చెంగయ్య దస్తావేజు చదివి— 'ఆస్తియంతయు మూడు వాటాలు...వాటాకు ఐదెకరాలు. వాటాకు అప్పు మూడువేలు. శంకరయ్య వాటాకు తండ్రియు పినతండ్రియు ధర్మకర్తలు.' అనెను.

'అనగా?' అని సుందమ్మ ప్రశ్నించెను.

'వారు పెట్టినచో కద్దు, లేనిచో రద్దు.'

'పాడూరిలో మంచపుకోడే పోతరాజట. ఈ పినతండ్రి ఎవడు?' అని పాపయ్య అనెను.

'నాకు పెట్టడానికీ పెట్టకపోవడానికీ వాడెవడు? మానాయన చచ్చాడా?' అని శంకరయ్య గొలుసులు గలగలలాడగా నేల మట్టెను. సుందమ్మ నవ్వెను. చెంగయ్య పెదవులపై నగవువెన్నెల నిగనిగలాడెను.

శంకరయ్య తల వాల్చి—'నేను మాపిన్నాయన చేతులు కట్టి నా ఆస్తి నే తెచ్చుకుంటా'అని రోజెను.

'అంత పనిలేదు. నీవు ఒక కాకితము వ్రాసి కోర్టులో దాఖలుచేసిన చాలును. నీ పిన్నబ్బ నీకడకే పరుగెత్తుకొనివచ్చును.'

'నేను రాయలేనుగా, ఎట్లా?'

'నీవు వ్రాలుపెట్టిన చాలు. మిగిలినది సుందమ్మే పూర్తిచేయును'

అని పంతులనగా సుందమ్మ కిలకిల నవ్వెను.

'అట్లాగా?'అని శంకరయ్య అనెను.

'అట్లాగా లేదు, ఇట్లాగా లేదు. పంతులు గారూ, ముందు రిజస్టరునోటీసు వ్రాయించండి. మీ వ్రాత ప్లీడర్లకు వరఃడి.'

'చాలెండు. వ్రాయగా వ్రాయగా కరణము, దగ్గగా దగ్గగా మరణము'అని పంతు లనెను. పిదప చెంగయ్య చెప్పగా సుందమ్మ వ్రాయగా, సుందమ్మ వ్రాయగా చెంగయ్య చెప్పగా పాపయ్య దిద్దగా కొంతవడి కా నోటీసు సిద్ధమాయెను. శంకరయ్య మనసు ముసించిపోయెను. పాపయ్య శంకరయ్య గొలుసులు విప్పి కాకితమును కలమును చేతి కిచ్చెను. ఒక రెప్పపాటులో శంకరయ్య ఆ నోటీసు కడ్డదిడ్డముగా తాటికాయలు నిలిపెను.

'ఓరి నీ దుంప తెగ. కాకితమునకు కాటుక పూసితివిగదరా'అని పాపయ్య అల్లుని మనికట్టుమీద కఱ్ఱ విరిచెను. శంకరయ్య విలవిలలాడుచుండగా 'ఫరవా లేదు, ఇది నకలుగా మన కుపయోగించును'అని సుందమ్మ యనెను.

'ఎటులయినను సుందమ్మ మగనిపక్షము'అని చెంగయ్య శంకరయ్య సంతసించుచుండగా గబగబ మరొక కాకితము వ్రాసెను. శంకరయ్యగుండెలు గుబగుబలాడెను.

'ఈసారి తిన్నగా ఇక్కడ వ్రాలు పెట్టు; వెనుక నోటుమీద పెట్టినట్లు'అని పాపయ్య గోరితో గీచి చూపెను.

శంకరయ్య చేయి లేవలేదు. 'చేవ్రాలు పెట్టినచో తన తలిదండ్రులు తనకు గారు. చేవ్రాలు పెట్టినచో మామ తన ఆస్తి నంతయు నేకాక తన్నుగూడ తినివేయును. పులిమీద పుట్ర - ఇక సుంది తన మాట వినునా?' అతనికనులముం దిది యంతయు గిఱ్ఱున దిరిగెను.

'వ్రాలు పెట్టు' అని సుందమ్మ గదిమెను.

శంకరయ్య స్థాణువువలె గూరుచుండెను. సుందమ్మ కన్ను గిరిపెను.

చెంగయ్య తల యూపెను. పాపయ్య మొద్దు కొడవలి తెచ్చి—'వ్రాలు పెట్టు'మని అరచెను. శంకరయ్య కనులు మూసికొనెను. శంకరయ్య బుజముమీద కొడవలి తళుక్కున మెరసెను. బుజము రక్తము చిమ్మెను.

'ఓసీ, నీబావకు తడిగుడ్డ చుట్టు. అమ్మా, గరిటె కాలబెట్టు' అని సుందమ్మ హుకు మిచ్చెను.

'వాతలు పెట్టనిదే వ్రాలు పెట్టడు' అని పాపయ్య పంతులను చూచెను.

'తొందరగా' అని చెంగయ్య అనెను. పాపయ్య లోనికి పోబోయెను. 'ఇదిగో తెచ్చుచుంటి' నని సూరమ్మ అనెను. ఒక మరదలు వచ్చి తడికట్టు కట్టెను. ఇంకొక మరదలు పేపచువ్వ ఫెడీ మనిపించెను. చిన్నమరదలు తన్నెను. పెద్దబావమరది కారు తెచ్చెను. పంతులు తొడకు పట్టించెను. చిన్నమరది చెంపకాయ పెట్టెను.

శంకరయ్య మొఱ్ఱోమని చేతు లొగ్గెను. లబలబలాడెను. దణ్ణములు పెట్టెను. ఊరెగిరిపోవ సోకాలు

పెట్టెనుగాని సంతకముమాత్రము పెట్టలేదు. 'ఇపుడే యిటులు హింసింపగా వ్రాలుపెట్టినపిదప వీరు మందు పెట్టి చంపరా?' అని అతనికి తోచెను.

అత్త కుంపటి తెచ్చెను. బావ విసరుచుండెను. అందరును 'వ్రాలు వ్రాలు' అని అనుచుండిరి. మరదలు శంకరయ్యరెప్పలను కిందికి మీదికి లాగెను. కుంపటిలో కాలిన సన్నపాటి గరిటె యిపుడే రక్తము చిమ్ముచున్నటు లుండెను.

'వ్రాలు పెట్టు' అని సుందమ్మ చరచెను. శంకరయ్య తనచేతిలోని కాకితమును నిప్పులలోనికి విసరెను. చరాలున గరిటె తీసి పాపయ్య శంకరయ్యవీపుమీద నాలు గయిదుచోటుల వాతలు పెట్టెను. శంకరయ్య కన్నులు నిండార విప్పి సుందమ్మను చూచి సొమ్మసిల్లెను.

'కొట్టు, మొగముమీద నీళ్లు కొట్టు' అని పంతులనెను.

ఆరు నెలలకుగాని ఆ వాతలు శంకరయ్యకు మానలేదు. పైగా మందు పెట్టుదురను జంకు. తం. రా. డను కొంకు. వీనిచే నతడు ఎముకలగూ డాయెను. సుందమ్మ తలుపు తాళము తీసి చీకటికొట్టులోనికి వెళ్లి—'నేటి కయినను వ్రాలు పెట్టుదువా పెట్టవా?' అని ఊరిమెను.

శంకరయ్య సుంపమ్మ నిండువిగ్రహమును మరల నానాడే చూచి తల వాల్చి యూరకుండెను.

'పెట్టుదువా పెట్టవా?'

'పెట్టను.'

'నీవు పెట్టకున్న ఆగదు. నీ యాస్తిని నీ యబ్బ యాస్తినిగూడ మింగగలవాని తీసికొనివత్తును చూడు' అని సుందమ్మ నిర్గమించెను.

శంకరయ్య కరోమయమయిపోయెను.

సుందమ్మతాను చెప్పినచందముగనే ఆ మరునాడు మగపిల్లవానిని కనెను.